ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.0
కనిష్ఠం 18.4

ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి

5

శనివారం 23 నవంబరు 2024



ప్రణాళికతోనే
ఉత్తమ ఫలితం
» పదో తరగతి పరీక్షలకు గడువు 113రోజులే 6
» మొత్తం గంటలు 2,712 » చదువుకు మిగిలేది 678 గంటలే

మార్కెట్ యార్డు నిర్మాణంపై కదలిక వచ్చేనా?



భువనగిరి వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌ను అత్యాధునిక హంగులతో నిర్మించేందుకు గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా, మార్కెటింగ్ శాఖ నిధులు మంజూరు చేయలేదు. దీంతో ఈ మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభానికి నోచలేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం నూతన మార్కెట్ యార్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటుందా? అని రైతులు ఎదురుచూస్తున్నారు. అయితే గత ప్రతిపాదనలు కాకుండా తాజాగా మరోసారి అంచనాలతో కూడిన నివేదికను కోరనున్నట్లు తెలిసింది.
- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

- » ఆధునిక హంగులతో భువనగిరి మోడల్ మార్కెట్ యార్డు
- » బీబీనగర్‌లోని గూడూరులో 17 ఎకరాల్లో నిర్మించేందుకు సన్నాహాలు
- » రూ.30కోట్లతో మార్కెట్ యార్డు?
- » విశాలంగా ఆధునిక గోదాములు, కల్లాలు, విశ్రాంతి భవనం,
- » పరిపాలనా కార్యాలయం నిర్మాణానికి గతంలో మార్కెటింగ్ శాఖ ప్రతిపాదనలు
- » తాజా ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరుతున్న రైతులు

భువనగిరి గంజ్‌లో ప్రస్తుతం ఉన్న మార్కెట్ యార్డును భువనగిరి పట్టణ శివారులోని బీబీనగర్ మండలం గూడూరుకు తరలించేందుకు సన్నాహాలు చేసింది. గూడూరులోని సర్వే నెం.69లో 17 ఎకరాల భూమిని మార్కెటింగ్ శాఖకు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మోడల్ మార్కెట్ యార్డు నిర్మాణానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఈమేరకు మార్కెట్ యార్డు స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.45కోట్లు మంజూరుచేసింది. ప్రస్తుతం భువనగిరి గంజ్‌లో కొనసాగుతున్న మార్కెట్ యార్డు ఇరుకుగా మారింది. మార్కెట్ యార్డు చెందిన ఐదు గోదాములున్నాయి. అయితే వీటిలో రెండు గోదాములను సివిల్ సప్లయి శాఖకు బియ్యం నిల్వ చేసుకునేందుకు, మరో మూడు వేర్‌హౌస్‌లకు అద్దెకిచ్చారు. పలు ప్రాంతాలకు బియ్యంతోపాటు నిత్యావసర సరుకులు మార్కెట్ యార్డులోని గోదాముల నుంచి తరలిస్తుంటారు. నిత్యం పెద్ద లారీలు రాకపోకలు కొనసాగుతాయి. అయితే మార్కెట్‌యార్డు గోదాములకు వచ్చేందుకు రోడ్డు చిన్నవిగా ఉండటంతో వాహనాల రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులవుతున్నాయి. మరోవైపు ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటుచేయడంతో భువనగిరి జిల్లాకేంద్రంగా ఏర్పడింది. దీంతో గంజ్‌కు, కాలనీలకు వచ్చే వాహనాల రాకపోకలు మరింత పెరిగాయి. తరుచుగా వాహనాలు నిలిచిపోయి, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. కాలనీవాసులు కూడా మార్కెట్‌యార్డును శివారు ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరుచేసి మార్కెట్ యార్డును అత్యాధునిక హంగులతో భువనగిరి శివారులోని గూడూరులో 17ఎకరాల విస్తీర్ణంలో విశాలంగా నిర్మించాలని కోరుతున్నారు.

రూ.30కోట్లతో మార్కెట్ యార్డు కోసం ప్రతిపాదనలు

భువనగిరి మార్కెట్ యార్డును 17 ఎకరాల్లో అత్యాధునికంగా రూ.30కోట్లతో నిర్మించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు మార్కెటింగ్ శాఖ అంచనాలు రూపొందించింది. ఈ మేరకు ప్రభుత్వానికి జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలు పంపింది. జిల్లాలో ప్రధానంగా వరి, కందులు, పత్తి, జొన్న, మొక్కజొన్న, కూరగాయల పంటలను సాగుచేస్తారు. రైతులు పండించిన పంటలకు మద్దతు దర లభించనట్లయితే, రైతులు తమ ధాన్యాన్ని మార్కెట్ కమిటీ గిడ్డంగుల్లో నిల్వ ఉంచుకునే అవకాశం ఉంది. అయితే రైతులకోసం ఆధునిక గోదాములు, ధాన్యం ఆరబోసుకునేందుకు కల్లాలు, రైతులకు విశ్రాంతి భవనంతోపాటు పరిపాలన కార్యాలయాన్ని నిర్మించాలని నిర్ణయించారు. అదేవిధంగా జిల్లా నగరానికి చేరువలో ఉంది. అయినప్పటికీ రైతులు తమ ధాన్యాన్ని నిల్వ ఉంచుకునేందుకు ఒక్క కోల్డ్ స్టోరేజీ కూడా అందుబాటులో లేదు. రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు. అయితే మార్కెటింగ్ శాఖ ప్రభుత్వం నూతనంగా

- మిగతా 8వ పేజీలో

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 22,554

» ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల » డిసెంబరు 9వరకు అభ్యంతరాల స్వీకరణ



నల్లగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): శాసనమండలి నల్లగొండ- ఖమ్మం- వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గంలో 22,554 మంది ఓటర్లుగా నమోదయ్యారు. కేంద్ర ఎన్నికల సంఘం రూపొందించిన షెడ్యూల్ ప్రకారం ముసాయిదా ఓటర్ల జాబితాను శుక్రవారం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి విడుదల చేశారు. నియోజకవర్గంలో మొత్తం 12 జిల్లాల పరిధిలో 28,698 మంది ఉపాధ్యాయ ఓటర్లు దరఖాస్తు చేసుకోగా, 22,554 దరఖాస్తులను ఆమోదించారు. పలు కారణాలతో 6,144 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, సూచనలు, ఆక్షేపణలు, సవరణలుంటే డిసెంబరు 9వ తేదీ వరకు ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో సమర్పించాలి. వాటిపై విచారణ నిర్వహించి డిసెంబరు 25వ తేదీన పరిష్కరిస్తారు. డిసెంబరు 30న ఓటర్ల తుది జాబితాను ప్రచురిస్తామని కలెక్టర్ వెల్లడించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటర్లు ఇలా..

జిల్లా	మండలాలు	పోలింగ్ స్టేషన్లు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	మొత్తం ఓటర్లు
నల్లగొండ	33	37	2,479	1,699	4,178
సూర్యాపేట	23	23	1,574	893	2,467
యాదాద్రి	17	17	549	277	826
సిద్దిపేట	4	4	110	39	149
జనగాం	12	12	488	322	810
హనుమకొండ	11	15	2,503	1,921	4,424
వరంగల్	13	13	1,195	728	1,923
మహబూబాబాద్	18	16	868	402	1,270
భూపాలపల్లి	7	7	161	103	264
ములుగు	9	9	368	204	572
భద్రాద్రి	23	23	950	859	1,809
ఖమ్మం	21	24	2,253	1,609	3,862
మొత్తం	191	200	13,498	9,056	22,554

న్యూస్ బాక్స్

మెరుగైన సేవలందించాలి

డీఎంహెచ్‌వో మనోహర్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మనోహర్

భువనగిరి రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు వారికి అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వో డాక్టర్ మనోహర్ అన్నారు. శుక్రవారం భువనగిరి మండలం అనంతారంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతీరోజు మెడికల్ ఆఫీసర్లకు నిర్వహించే కలెక్టర్‌తో జరిగిన జూమ్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. క్రమం తప్పకుండా ఓపీ సేవలు అందించాలని, గర్భిణులు చిన్న పిల్లలకు టీకాలు సకాలంలో వేసే విధంగా చూడాలన్నారు. కుష్టు నివారణ సమాజ స్థాపనకు ప్రతీ ఒక్కరు చొరవ చూపాలన్నారు. సమావేశంలో పల్లె దవాఖాన డాక్టర్ కొండ మురళీమోహన్, సురేశ్, రమాదేవి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్‌డే

డీఈ వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈ వెంకటేశ్వర్లు

భువనగిరి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్‌డే నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో డీఈ వెంకటేశ్వర్లు అన్నారు. భువనగిరి ట్రాన్స్‌కో డీఈ కార్యాలయంలో నిర్వహించనున్న విద్యుత్ వినియోగదారుల గ్రీవెన్స్‌డే సన్నాహక సమావేశం శుక్రవారం భువనగిరిలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరి కిసాన్‌నగర్‌లోని ట్రాన్స్‌కో డీఈ కార్యాలయంలో శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే గ్రీవెన్స్‌డేకు జిల్లాలోని భువనగిరి, తుర్కపల్లి, ఆలేరు, యాదగిరిగుట్ట, రాజాపేట, మోటకొండూర్, బీబీనగర్, బొమ్మలరామారం, మోత్కూర్, ఆత్మకూర్(ఎం), గుండాల, అడ్డగూడూరు మండలాల విద్యుత్ వినియోగదారుల హాజరై సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రీవెన్స్‌డేకు హాజరయ్యే వారు విద్యుత్‌బిల్లు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భువనగిరిలో ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ట్రాన్స్‌కో టౌన్ ఏఈ సాయికృష్ణ గురువారం తెలిపారు. హైదరాబాద్ చౌరస్తా నుంచి జిల్లా కేంద్ర ఆస్పత్రి వరకు ప్రధాన రహదారితో పాటు పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

లక్షన్నర ఎకరాలకు సాగునీరిస్తాం

» 1.5 టీఎంసీల సామర్థ్యంతో గంధమల్ల రిజర్వాయర్ పూర్తి చేస్తాం » ఆలేరు ప్రజలపై కేసీఆర్‌కు ఎందుకంత కక్ష » మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వేదికపై మంత్రి సీతక్క, ప్రభుత్వ విప్ అయిలయ్య, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గంధమల్ల రిజర్వాయర్ పూర్తి చేసి లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందిస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం యాదగిరిగుట్టలో ఆలేరు, భువనగిరి, జనగాం నియోజకవర్గాలకు రూ.210కోట్లతో చేపట్టనున్న మిషన్‌భగీరథ పైలాన్ పనులను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఆలేరు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి జిల్లా నల్లగొండపై పగబట్టినందుకే అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను ఖతం చేశారన్నారు. ఆలేరు నెత్తిన మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లు ఉన్నప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం తాగు, సాగునీరు ఇవ్వలేదని కనీసం రూ.200కోట్లు కేటాయిస్తే ప్రజలకు నీరందేదన్నారు. మూడు నియోజకవర్గాల దాహార్తి తీర్చడానికే రూ.210కోట్లతో పనులు పూర్తి చేసి దాహార్తి తీర్చుతామన్నారు. మూసీ శుద్దీకరణచేసి గోదావరి నీళ్లను తీసుకొచ్చి, 1.5 టీఎంసీల సామర్థ్యంగల గంధమల్ల రిజర్వాయర్ పనులు పూర్తిచేసి, లక్షన్నర ఎకరాలకు సాగు నీరందిస్తామన్నారు. ఆలేరు ప్రజలపై కేసీఆర్ ఎందుకు కక్షకట్టారో ఇప్పటికీ అర్థం కావడంలేదన్నారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన సాగర్ 70 ఏళ్ల వరకూ చెక్కుచెదరలేదని, కేసీఆర్ నిర్మించిన మేడిగడ్డలోని పియర్లు ఏడాదికే కుప్ప కూలాయన్నారు.

రూ.210 కోట్లతో మిషన్ భగీరథ పనులు

రూ.210కోట్లతో చేపడుతున్న మిషన్‌భగీరథ పెండింగ్ పనులు పూర్తయితే మూడు నియోజకవర్గాల్లోని 523 గ్రామాలకు తాగునీరు అందుతుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు పంచిన భూములను బీఆర్ఎస్ నాయకులు ధరణి పేరుతో లాక్కున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 50వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ నెల 26న గ్రామపంచాయతీ ఉత్సవాలు నిర్వహిస్తామని, వారోత్సవాల నిర్వహణకు నిధులు కూడా మంజూరు చేశామన్నారు.

తక్కువ సమయంలో ఎక్కువ అభివృద్ధి

తక్కువ సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కువ అభివృద్ధి పనులు చేపడుతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ఇప్పటివరకు ఆలేరు నియోజకవర్గంలో 90శాతం చెరువులు నిండాయని, రైతులకు ఎలాంటి కష్టాలు రాకుండా కృషి చేస్తానని చెప్పారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం 16 కిలోమీటర్లకు రూ.200 కోట్లు కేటాయించి ఉంటే భువనగిరి, ఆలేరు, జనగామ నియోజకవర్గాలకు తాగు నీటి సమస్య ఉండేది కాదని, కేసీఆర్ నిర్లక్ష్యంతోనే తాగు నీటి సమస్య జటిలమైందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, ఆలేరు మార్కెట్‌కమిటీ చైర్మన్ చైతన్యరెడ్డి, స్థానిక మునిసిపల్ చైర్మన్ ఎరుకల సుధా హేమేందర్‌గౌడ్, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, పార్టీ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజ్‌గౌడ్, నాయకులు గుండ్లపల్లి భరత్ గౌడ్, ముక్కెర్ల మల్లేశ్, దుంబాల వెంకట్‌రెడ్డి, శిఖ ఉపేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నల్లగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని వ్యవసాయ, సహకార, ఉద్యానశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. శుక్రవారం నల్లగొండ కలెక్టరేట్‌లో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం సేకరణలో గత ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలు, అవినీతి కారణంగా పౌరసరఫరాలశాఖ రూ.50వేల కోట్ల అప్పుల్లో కూరుకుందని, తమ ప్రభుత్వం వచ్చాక రూ.10వేల కోట్ల అప్పు తీర్చడంతో పాటు ధాన్యం, పత్తికొనుగోళ్లు సజావుగా సాగేలా చూస్తున్నామన్నారు. రాష్ట్రంలో వరి, పత్తి సాగు ఎక్కువైందన్నారు. ప్రకృతి విపత్తులు ఈ పంటలపై ప్రభావం చూపుతాయని, వీటిని అధిగమించి రైతులకు శాశ్వత ఆదాయం ఉండాలంటే ఆయిల్‌పామ్ సాగే సరైనదన్నారు. ఆ దిశగా రైతాంగాన్ని ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికార యంత్రాంగం చైతన్యం చేయాలని సూచించారు. కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకుంటూ వచ్చే నిధులతో జిల్లాలో అవసరమైన కార్యక్రమాలు అమలు చేయాలని, అందుకు ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దిశ కమిటీలు దేశవ్యాప్తంగా 780పైగా జిల్లాల్లో అమలవుతున్నాయని, ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కేంద్రం అమలు చేసే పథకాలను సద్వినియోగం చేసేలా ఎంపీలు రఘువీర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి

- మిగతా 7వ పేజీలో

కుటుంబ సర్వే 95శాతం పూర్తి

» ప్రారంభమైన డాటా ఎంట్రీ

» అన్ని మండలాలు, మునిసిపాలిటీలలో ప్రత్యేక కేంద్రాలు



భువనగిరి మునిసిపల్ కార్యాలయంలో డాటా ఎంట్రీ కేంద్రం

భువనగిరి టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుల సర్వే జిల్లాలో తుది దశకు చేరింది. ఈ నెల 6న ప్రారంభమైన సర్వేలో నేటికి 95శాతం సర్వే పూర్తయింది. మిగులు సర్వేను కూడా రెండు మూడు రోజుల్లో పూర్తి చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. 1910 మంది ఎన్యూమరేటర్లు జిల్లాలోని 2,60,559 కుటుంబాల సర్వేను చేయాల్సి ఉండగా, సుమారు 2.47లక్షల కుటుంబాలను సర్వే చేశారు. సర్వే వివరాల ఆన్‌లైన్ ప్రక్రియ శుక్రవారం జిల్లా అంతటా ప్రారంభమైంది. ఇందుకు జిల్లాలోని 17 మండలాలు, ఆరు మునిసిపాలిటీల్లో డాటా ఎంట్రీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో కుటుంబ సర్వే 95శాతం పూర్తయింది. బొమ్మలరామారం, తుర్కపల్లి మండలాల్లో రెండు రోజుల క్రితమే 100 శాతం సర్వే పూర్తి చేశారు. మిగతా 15 మండలాలు, ఆరు మునిసిపాలిటీల్లో సుమారు 95శాతం పూర్తి కాగా రెండు మూడు రోజుల్లో వంద శాతం సర్వే లక్ష్యం పూర్తి కానున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

ప్రారంభమైన డాటా నమోదు

ఎన్యూమరేటర్లు ఇంటింటా సేకరించిన సర్వే వివరాల డాటా ఎంట్రీ జిల్లా అంతటా శుక్రవారం ప్రారంభమైంది. ఇందుకోసం అన్ని మండలాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. డాటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా నియమించారు. అయితే కొన్ని మండలాల్లో సరిపడా కంప్యూటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు లభించడం లేదని తెలుస్తోంది. అలాగే అపరేటర్లకు డాటా ఎంట్రీపై

- మిగతా 8వ పేజీలో

జిల్లా అంతటా డాటా ఎంట్రీ ప్రారంభమైంది



జిల్లాలో కుటుంబ సర్వే సుమారు 95శాతం పూర్తయింది. త్వరలోనే 100 శాతం లక్ష్యాన్ని సాధిస్తాం. రెండు మండలాల్లో ఇప్పటికే శతశాతం నమోదైంది. శుక్రవారం నుంచి జిల్లా అంతటా సర్వే వివరాల డాటా ఎంట్రీ ప్రారంభమైంది. ఇందుకోసం అన్ని మండలకేంద్రాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశాం. శనివారం నుంచి పూర్తిస్థాయిలో డాటా ఎంట్రీ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఇందుకు ఏర్పాట్లు పూర్తిచేశాం. ఆపరేటర్లకు స్థానికంగానే శిక్షణ ఇస్తున్నారు.
- శామ్యూల్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి

నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలి

» కలెక్టర్ హనుమంతరావు » హాస్టళ్లను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ » భోజనం నాణ్యతపై ఆగ్రహం



ఎస్టీ హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్లకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. ఎంఎల్ పాయింట్ ద్వారా సరఫరా అవుతున్న బియ్యం నాణ్యతపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. హాస్టళ్లలోని నాణ్యతలేని బియ్యాన్ని వెనక్కి తీసుకొని నూతన బియ్యాన్ని వెంటనే అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భువనగిరిలోని ఎస్టీ బాలుర, ఎస్సీ బాలుర కళాశాల విద్యార్థుల హాస్టళ్లను శుక్రవారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెండు హాస్టళ్లలో భోజనం నాణ్యతను, వంట దినుసులను పరిశీలించారు. అన్నం దొడ్డుగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తంచేసి బియ్యాన్ని పరిశీలించారు. చూడటానికి బియ్యం సన్నగా ఉన్నప్పటికీ వండాక దొడ్డుగా మారుతుందని ఎస్సీ కళాశాల హాస్టల్ వంట సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. దీంతో అక్కడి నుంచే కలెక్టర్ సివిల్ సప్లయి శాఖ అధికారులకు ఫోన్‌చేసి బియ్యం నాణ్యతపై ఆగ్రహం వ్యక్తంచేసి వెంటనే బియ్యాన్ని మార్చాలని ఆదేశించారు. వంటశాలలను పరిశుభ్రంగా ఉంచాలని, పాత్రలను శుభ్రంగా కడగాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి రోజువారి భోజనం నాణ్యత, వసతులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై సంబంధిత అధికారులకు వెంట వెంటనే సమాచారం ఇవ్వాలని, విద్యార్థులకు సూచించారు. హాస్టళ్ల నిర్వహణ తీరును మెరుగు పర్చాలని ఆదేశించారు. ఆయనవెంట వార్డెన్ ఆనంద్, ఆర్ఐ భద్రయ్య తదితరులున్నారు.

జిల్లాకు నర్సింగ్ కళాశాల మంజూరు

రూ.26కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

భువనగిరి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భువనగిరిలో నూతనంగా ప్రారంభమైన ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టియానా జెడ్ చోంగ్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే కళాశాల ఏర్పాటుకు రూ.26కోట్లను విడుదలచేశారు. కాగా 50 సీట్లతో ప్రారంభమైన ప్రభుత్వ వైద్య కళాశాల భువనగిరిలోని పాత కలెక్టరేట్ భవనంలో గత నెలలోనే ప్రారంభమైంది. జిల్లా ఆస్పత్రిని వైద్య కళాశాల బోధనాస్పత్రిగా మార్చారు. నూతనంగా మంజూరైన నర్సింగ్ కళాశాల కూడా ప్రస్తుత వైద్య కళాశాల భవనంలోనే ఏర్పాటు చేస్తారా? లేదా? త్వరలో తేలనుంది. అలాగే నర్సింగ్ సీట్లపై కూడా స్పష్టత రావాల్సి ఉంది.

ఏ విద్యార్థికైనా మొదటి పబ్లిక్ పరీక్ష, పైచదువులకు తొలిమెట్టు పదో తరగతి. వచ్చే ఏడాది మార్చి 16 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభ ఒకానున్నాయి. సమయం దగ్గర పడుతోంది. పరీక్షలకు మిగిలింది కేవలం 113 రోజులే. ఇక విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఒక రోజులో పాఠశాలలో గడిపే సమయం, ఆటలు, నిద్రకు కలిపి 18 గంటలు మినహాయిస్తే, చదువుకు మిగిలిన సమయం ఆరు గంటలు మాత్రమే. ఆ చొప్పున 113 రోజుల్లో ఏడు పాఠ్యాంశాలపై కసరత్తు చేసేందుకు సుమారు 678 గంటలు మాత్రమే ఉన్నాయి. ఆ లెక్కన ఒక్కో పాఠ్యాంశంపై విద్యార్థి ప్రతి రోజూ సుమారు గంటలోపే సమయాన్ని కేటాయించే అవకాశం ఉంది. కాలయాపన చేయకుండా పక్కా ప్రణాళికతో టైంటేబుల్‌ను అమలు చేయగలిగితే ఎటువంటి భయం లేకుండా పరీక్షలు రాసే అవకాశం ఉంది. అంతేకాక 10/10 పాయింట్లు సాధించటం కష్టమేమీ కాదు. పాఠ్యాంశాలపై పట్టు సాధిస్తే మంచి మార్కులతో, ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు వారి సూచనలు, సలహాలు మీకోసం.. (ఆంధ్రజ్యోతి-కోదాడ)





ప్రణాళికతోనే ఉత్తమ ఫలితం

- పదో తరగతి పరీక్షలకు గడువు 113రోజులే
- మొత్తం గంటలు 2,712
- మొత్తం సబ్జెక్టులు 7
- ఒక్కో సబ్జెక్ట్‌లో పాఠ్యాంశాలు సంఖ్య 20 నుంచి 22
- 24గంటలలో 18గంటలు
- చదువుకు మిగిలేది రోజులో 6గంటలు

- మొత్తం 678 గంటలు చదివేందుకు అవకాశం
- అప్రమత్తతే ప్రధానమంటున్న టీచర్లు




బొమ్మలతో చక్కగా వివరిస్తే జీవశాస్త్రంలో ఉత్తమ మార్కులు



జీవశాస్త్రంలో ప్రయోగాత్మక ప్రశ్నలతో పాటు, బొమ్మలను చక్కగా వివరిస్తే మంచి మార్కులు సాధించవచ్చు. జీవశాస్త్రంలో ప్రధానంగా పోషణ ఆహార సరఫరా వ్యవస్థ, ప్రసరణ పదార్థ రవాణా వ్యవస్థ, నియంత్రణ, సమన్వయ వ్యవస్థ, ప్రత్యుత్పత్తి, పునరుత్పత్తి వ్యవస్థ, అనువంశీకరణ, విసర్జన వ్యర్థాల తొలగింపు వ్యవస్థల గురించి కసరత్తు చేస్తే మంచి మార్కులు సాధించవచ్చు. బొమ్మలు చక్కగా గీసి, భాగాలను గుర్తించి విశ్లేషిస్తే మంచి మార్కులు సాధ్యం. ఆకు అడ్డుకోత, ఉమ్మెత్తపువ్వు, వానపాము అడ్డుకోత, గుండె, మూత్రపిండం, అంతర్నిర్మాణం, నెఫ్రాన్ నిర్మాణ బొమ్మలు ముఖ్యమైనవి. ప్రతీ పాఠ్యాంశాన్ని చదివి, అందులో ముఖ్యమైన అంశాల గురించి తెలుసుకోగలిగితే ఒకటి, రెండు మార్కుల ప్రశ్నలకు సమాధానాన్ని సులభంగా రాయవచ్చు.

- ఎల్ దేవరాజు, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు

వ్యాకరణాంశాలకు ప్రాధాన్యం



తెలుగును ప్రతీ విద్యార్థి తేలికగా తీసుకోవడంతోనే మార్కులు సాధించలేకపోతున్నారు. తెలుగులో ఎక్కువ మార్కులు సాధించాలంటే భాషాంశాలు, వ్యాకరణాంశాలపై పట్టు సాధించాలి. అక్షరదోషాలు లేకుండా చక్కటి చేతి రాతతో మార్కులు సాధించవచ్చు. ఉదాహరణల ద్వారా పదజాలం, వ్యాకరణాంశాన్ని అర్థమయ్యేలా వివరించాలి. పద్యభాగం, గద్యభాగంలో పాఠ్యాంశాలను సమగ్రంగా నేర్చుకుంటే మంచి మార్కులు పొందవచ్చు.

- వీరబ్రహ్మాచారి, తెలుగు ఉపాధ్యాయుడు

ద్వితీయభాషలో పట్టు సాధిస్తే ఉత్తమ ఫలితం




పది జీపీఏ సాధించాలంటే విద్యార్థులు ద్వితీయ భాష(హిందీ)లో పట్టు సాధించాలి. వ్యాకరణాంశాలు, లఘు ప్రశ్నలకు సమాధానాలు నేర్చుకుంటే ఉత్తీర్ణత సాధించవచ్చు. అత్యధిక మార్కులు సాధించాలంటే పాఠ్యాంశంలో ముఖ్యమైన ప్రశ్నలకు సమాధానాలు నేర్చుకోవాలి. హిందీలో పద్యం, గద్యం నుంచి అడిగే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వగలిగితే సులభంగా మార్కులు వస్తాయి. హిందీపై విద్యార్థులు చిన్నచూపు చూడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

- ఏ పద్మావతి, హిందీ ఉపాధ్యాయురాలు

సమాన ప్రాధాన్యమిచ్చి చదవాలి



భూగోళశాస్త్రం, చరిత్ర, అర్థశాస్త్రం, పౌరశాస్త్రానికి సమాన ప్రాధాన్యమిచ్చి చదివితే సాంఘిక శాస్త్రంలో మంచి ఫలితాలు సాధించవచ్చు. ప్రపంచ యుద్ధాలు, జరిగిన ప్రదేశాలు, సంవత్సరాలు, కారణాలు, ఉద్యమాల గురించి సమగ్రంగా తెలుసుకోవాలి. దేశ, ప్రపంచ చిత్రపటాలలో పేర్లు గుర్తించటం వల్ల అతి తక్కువ సమయంలో ఐదు మార్కులు సాధించవచ్చు. అందుకు మ్యాప్ ప్రాక్టీస్ చేయాలి. పాఠ్యాంశాల్ని పూర్తిగా చదివి, సొంతంగా బిట్స్ రూపొందించుకోగలిగితే బిట్ పేపర్, లఘుప్రశ్నలను సులభంగా చేయవచ్చు.



- కే కరుణ, సోషల్ ఉపాధ్యాయురాలు


గణితంలో కసరత్తే కీలకం



గణితంలో 100కు 100మార్కులు తెచ్చుకొనే అవకాశం ఉంది. అందుకు కసరత్తు అవసరం. సమస్యను క్లుప్తంగా చదివి అర్థం చేసుకొని సమాధానం ఇవ్వగలగాలి. బహుపదులు, శ్రేణులు, రేఖా సమీకరణలపై పట్టుతో పాటు సంఖ్యాశాస్త్రం, సంభావ్యత, వృత్తానికి స్పర్శరేఖలు, త్రికోణమితి, నిరూపక రేఖా గణితం, అనువర్తనాలపై పట్టు సాధించాలి. గణితంలో బట్టీపట్టడం కన్నా సూత్రాలు, సమీకరణాల సాధనతో సమాధానాలు రాబట్టడంతో మంచి మార్కులు పొందే అవకాశం ఉంది.గ్రాఫ్ నిర్మాణాలు నేర్చుకోవటం, త్రికోణమితి చిత్రాలు గీయటంతో నైపుణ్యం పెంచుకుంటే సులభంగా మార్కులు పొందవచ్చు.

- కే పాండురంగాచారి, గణిత ఉపాధ్యాయుడు

సూక్ష్మ సమాధానాలను సాధన చేయాలి



భౌతిక, రసాయనశాస్త్రాల్లో మంచి మార్కులు సాధించాలంటే సూక్ష్మ(బిట్స్) సమాధానాలపై ఎక్కువగా సాధన చేయాలి. అంతేకాక పరిశోధనాత్మక ఆలోచనతో పాఠ్యపుస్తకాన్ని అవగాహన చేసుకోవాలి. ప్రతీ పాఠ్యాంశాన్ని పరిశోధనాత్మకంగా ఆలోచించి నిర్వచనాలు, ఫార్ములాలను అన్వయించి సమాధానాలు రాయాలి. బొమ్మను గీసి ప్రయోగాత్మకంగా వర్ణించటం, బేధాలు, చిత్రపటాలు నేర్చుకుంటే సులభంగా మార్కులు పొందవచ్చు. భౌతిక, రసాయన శాస్త్రాల్లో మొదటి నాలుగు అధ్యాయాలు ఎంతో కీలకం. ముఖ్యమైన ప్రశ్నలను నేర్చుకుంటే మంచిది.

- శ్రీనివాసరెడ్డి, భౌతిక శాస్త్రం,ఉపాధ్యాయుడు

ఆంగ్లంలో వ్యాకరణాంశాలే కీలకం



పదో తరగతి ఆంగ్లంలో వ్యాకరణాంశాలే కీలకం. కాంప్రహెన్సివ్ ప్యాసేజీలను నిరంతరం సాధన చేయాలి. వ్యాకరణాంశాలను నేర్చుకోవటానికి రోజుకు గంట సమయం కేటాయించాలి. ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చు. ప్రశ్నలను పూర్తిగా చదివి అవగాహనతో సమాధానాలు రాయటంతో మంచి మార్కులు పొం దవచ్చు. ప్రశ్నల ట్యాగ్ రివిజన్‌తో ఉత్తమ ఫలితాలు అందుకోవచ్చు. ఆంగ్లంలో పద్యం, పేరాగ్రాఫ్ ప్రశ్నలకు సమాధానాలు, లేఖలు రాయటం ద్వారా సులభంగా మార్కులు పొందవచ్చు. పాఠ్యాంశంలోని ముఖ్య ప్రశ్నలకు సమాధానాలు, వ్యాకరణాంశాలను నేర్చుకోవాలి.

- మీనాక్షి, ఇంగ్లీషు ఉపాధ్యాయురాలు

కాశీలో ఉత్తమ్ దంపతుల ప్రత్యేక పూజలు

హుజూర్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి దంపతులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాశీ పుణ్యక్షేత్రాన్ని గురువారం సందర్శించారు. మంత్రి దంపతులతో పాటు కుటుంబసభ్యులు కాశీ విశ్వేరుడికి నిర్వహించిన ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం గంగానది ఒడ్డున గంగాహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ్ తండ్రి పురుషోత్తమ్‌రెడ్డి చితాభస్మాన్ని గంగానదిలో నిమజ్జనం చేశారు.



గంగాహారతి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్ దంపతులు

ఆత్మజ్ఞానం లేకపోవడమే అనర్థాలకు కారణం

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సకల జీవరాశుల్లో మానవ జన్మ ఉదాత్తమమైనదని, ప్రతీ వ్యక్తికి ఆత్మజ్ఞానం లేకపోవడం అన్ని అనర్థాలకు కారణమని హైదరాబాద్ పట్టణం కూకట్‌పల్లిలోని జగద్గురు మఠం, లలితాంబిక పీఠం సంస్థాపకులు సంపూర్ణానందగిరిస్వామి, కృష్ణా జిల్లా పెనమలూరు జ్ఞానసరస్వతీ పీఠాధిపతి ప్రకాశానంద సరస్వతీ అన్నారు. యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని మార్కండేశ్వరస్వామి దేవాలయంలో ఆధ్యాత్మిక భక్త సమాజం 15వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 22, 23, 24 తేదీల్లో ఆత్మజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన సదస్సులో భక్తులనుద్దేశించి వారు మాట్లాడుతూ పవిత్రమైన మానవ జన్మను ఉదర పోషణకై వృథా చేస్తున్నాడని, ఆత్మస్వరూపుడై అనాత్మ సంబంధమైన ప్రాపంచిక విషయాలకు ప్రాకులాడుతున్నాడన్నారు. ఆత్మజ్ఞానం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. ఆత్మజ్ఞాన సదస్సుకు ఆధ్యాత్మిక భక్త సమాజం అధ్యక్షుడు భారత పురుషోత్తం, గౌరవాధ్యక్షుడు కట్కం తుకారాం, ఉపాధ్యక్షుడు చక్రాల నర్సింహ, ప్రధానకార్యదర్శి నోముల అశోక్, సహాయకార్యదర్శి సుంకి వెంకటేశం, కోశాధికారి పుప్పాల నాగేశ్వర్, కన్వీనర్ డాక్టర్ సీత సత్యనారాయణతో పాటు భక్తులు పాల్గొన్నారు.



ఆత్మజ్ఞాన సదస్సులో భక్తులకు ప్రవచనాలు చేస్తున్న సంపూర్ణానంద గిరి స్వామి, ప్రకాశానంద సరస్వతీ స్వామి

పోచంపల్లిలో రాష్ట్రస్థాయి భజన పోటీలు

జనవరి 4 నుంచి 6వ వరకు పాండురంగస్వామి భజనమండలి స్వర్ణోత్సవాలు



భజన మందిరంలో స్వర్ణోత్సవ ఆహ్వాన పత్రాలు ఆవిష్కరిస్తున్న సభ్యులు

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర స్థాయి భజన పోటీలను జనవరి 4, 5 తేదీల్లో యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో నిర్వహిస్తున్నట్లు పాండురంగ స్వామి భజనమండలి అధ్యక్షుడు చక్రాల నర్సింహ, ప్రధాన కార్యదర్శి పుప్పాల నాగేశ్వర్ తెలిపారు. భజన మండలి 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా సర్ణోత్సవాలను నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా భజన పోటీలు ఉంటాయన్నారు. శుక్రవారం పోచంపల్లిలోని భజనమండలి మందిరంలో స్వర్ణోత్సవాల ఆహ్వానపత్రాలను ఆవిష్కరించి, మాట్లాడారు. జనవరి 4, 5 తేదీల్లో పోటీలు జరుగుతాయని, 4వ తేదీ శనివారం సాయంత్రం 6 గంటల నుండి పద్మశ్రీ, బ్రహ్మశ్రీ గరికపాటి నరసింహారావు ప్రవచనం ఉంటుందన్నారు. 6వ తేదీన సోమవారం ఉదయం 9-30 గంటలకు రుక్మాబాయి సమేత పాండురంగస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం భజనపోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పాండురంగ స్వామి భజనమండలి స్వర్ణోత్సవాల సంచిక ఆవిష్కరణ నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలకు అన్నివర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి భజన పోటీల్లో పాల్గొనే వారు మరిన్ని వివరాలకు 984883654, 9440579494, 9848799323 నెంబర్లకు ఫోన్‌లో సంప్రదించాలని కోరారు. పోటీల్లో పాల్గొనే వారు తమ పేర్లను డిసెంబరు 25వ తేదీలోగా నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో భజనమండలి వ్యవస్థాపక అధ్యక్షులు, మార్కండేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ డాక్టర్ సీత సత్యనారాయణ, భజనమండలి బృందం భారత వెంకటేశం, నోముల అశోక్, చిట్టిపోలు గోవర్ధన్, ఎలగందుల రవీందర్, దేవరకొండ అశోక్‌చారి. కట్కం తుకారాం, గుర్రం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీసీఎస్ ఐటీ క్విజ్‌లో తేజ విద్యార్థి ప్రతిభ

కోదాడ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):టీసీఎస్ ఐటీ క్విజ్-2024లో సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కొమరబండకు చెందిన తేజ విద్యాలయం విద్యార్థి ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ రమా సోమిరెడ్డి తెలిపారు. టాటా కంపెనీ బెంగళూరు టెక్ సమ్మిట్‌లో భాగంగా టీసీఎస్ ఆధ్వర్యంలో ఐటీ క్విజ్-2024 జాతీయ స్థాయి ఫైనల్స్ నిర్వహించిందన్నారు. దేశవ్యాప్తంగా అత్యుత్తమ 10 పాఠశాలల విద్యార్థులు ఫైనల్స్‌లో పోటీపడగా తేజ విద్యాలయానికి 9వ తరగతి విద్యార్థి నోముల సృజన్‌గుప్తా ప్రతిభ కనబరిచి 5వ స్థానంలో నిలిచారన్నారు. కర్ణాటక సైన్స్, టెక్నాలజీ శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే నుంచి సృజన్‌గుప్తా ట్రోఫీ, రూ.10 వేల నగదు బహుమతి అందుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పలువురు అభినందించారు.



సృజన్‌గుప్తా

రేపటి నుంచి సుంకిశాల వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

వలిగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం సుంకిశాల గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అధ్యయనోత్సవాలు సహిత వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 29వతేదీ వరకు ఉత్సవాలను నిర్వహించనున్నారు. భక్తుల కొంగుబంగారంగా విలసిల్లుతున్న ఈ ఆలయాన్ని డాక్టర్ పైళ్ల మల్లారెడ్డి - సాధన దంపతుల దాతృత్వంతో నెలకొల్పారు. నిత్యం అర్చనాదికాలు, అభిషేకాలు, ప్రత్యేక రోజుల్లో హోమాలు, కల్యాణోత్సవాలు ఇక్కడ వైభవంగా నిర్వహిస్తుంటారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఏ ఇంట్లో శుభకార్యం తలపెట్టినా, ఏ పని మొదలు పెట్టినా స్వామిని ఆరాధించాకే పనులు ప్రారంభిస్తుంటారు.

ఆరు రోజుల పాటు వేడుకలు

శ్రీ వేంకటేశ్వరస్వామి అధ్యయనోత్సవాలు సహిత 27వ వార్షిక బ్రహ్మోత్సవంలో భాగంగా ఈ నెల 24 ఆదివారం నుంచి 29వ తేదీ శుక్రవారం వరకు ఉత్సవాలను నిర్వహించనున్నారు. 24న అధ్యయనోత్సవాలతో పాటు వార్షిక ఉత్సవాలు ప్రారంభం, సోమవారం 25న నిత్యార్చన, పరమ పదోత్సవం, నిత్యార్చనలు, 26న రక్షాబంధనం, అంకుర్పాణ, 27న యాగశాల ప్రవేశం, గరుడాదివాసం, కృష్ణావతార అలంకార సేవ, ధ్వజారోహణం, నివేదన, భేరీ పూజా, దేవతాహ్వానం, ఆరగింపు, 28న హోమం, బలిహరణం, మహాపూర్ణాహుతి, నవకలశ స్నపనం, కల్యాణ వేంకటేశ్వర స్వామి అవతార అలంకరణ సేవ, మధ్యాహ్నం 12గంటలకు కల్యాణమహోత్సవం, 29న రథోత్సవం, అష్టోత్తర శతఘటాభిషేకం, నివేదన, తీర్థ ప్రసాదాల వినియోగం, రుత్విక్ సన్మానంతో ఉత్సవాలు పరిసమాప్తి అవుతాయి. ఈ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు శ్రీ వేంకటేశ్వరస్వామి ఛారిటబుల్ ట్రస్ట్ నిమగ్నమైంది. కల్యాణం అనంతరం సాయంత్రం గ్రామస్థులతో ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు.





సుంకిశాలలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, ఉత్సవమూర్తులు

ముస్తాబైన దేవాలయం

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు శ్రీ వేంకటేశ్వరస్వామి ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాట్లు పూర్తిచేసింది. గోపురాలు, ఆలయ ప్రాకారాలను రంగులతో తీర్చిదిద్ది, విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబుచేశారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిర్లు, మంచినీటి వసతి, తీర్థ ప్రసాదాల వితరణకు సర్వం సిద్ధం చేస్తున్నారు.

ఆలయంలో వివిధ పూజలు

శ్రీ స్వామివారి ఆలయంలో వివిధ పూజలు నిత్యం జరుగుతుంటాయి. శాశ్వత పూజ, స్వామి వారికి కల్యాణోత్సవం, వాహన పూజలు, నవగ్రహ పూజ, అభిషేకం, సహస్ర నామార్చన, సత్యనారాయణ స్వామి వ్రతం, అన్నప్రాసనం, అక్షరాభ్యాసం, వస్త్రాలంకరణ, కుంకుమార్చన జరుగుతాయి. భక్తులు శుభకార్యాలను కూడా ఈ ఆలయ ప్రాంగణంలో నిర్వహించుకుంటారు.

దేవరకొండ డిపో ఉద్యోగులకు ప్రగతిచక్ర అవార్డు



ప్రగతిచక్ర అవార్డులు అందుకున్న ఉద్యోగులను అభినందిస్తున్న డీఎం రమేష్‌బాబు

దేవరకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా దేవరకొండ ఆర్టీసీ డిపోలో ఉత్తమ సేవలు అందించిన ఏడుగురు ఉద్యోగులకు ప్రగతిచక్ర అవార్డులు వచ్చినట్లు డిపో మేనేజర్ రమేష్‌బాబు శుక్రవారం తెలిపారు. నల్లగొండ రీజియన్ పరిధిలో ప్రతి మూడు నెలలకు ఒక్కసారి జరిగే త్రైమాసిక ప్రగతిచక్ర అవార్డులను డిపో నుంచి 7 మంది ఉద్యోగులకు ఆర్ఎం రాజశేఖర్ ప్రగతిచక్ర అవార్డును, ప్రశంసాపత్రాలను, ప్రోత్సాహకాలను అందజేసినట్లు డీఎం తెలిపారు. డిపోను అన్నిరంగాలలో నల్లగొండ రీజియన్‌లోనే ప్రథమస్థానంలో నిలిపేలా కృషి చేయాలని ఉద్యోగులను కోరారు. ప్రగతిచక్ర అవార్డులను అందుకున్న ఉద్యోగులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో దేవరకొండ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ సైదులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు టైం పాఠశాల విద్యార్థుల ఎంపిక

హాలియా, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు నల్లగొండ జిల్లా హాలియాకు చెందిన టైం పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 నెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టుకు 9వ తరగతి విద్యార్థులు ఐశ్వర్య, దత్తులు ఎంపికయ్యారు. విద్యార్థుల ఎంపికపై పాఠశాల డైరెక్టర్స్ మందా నరేందర్‌రెడ్డి, కత్తి కోటిరెడ్డి, పీఈటీలు, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసి, అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు డిండి విద్యార్థినులు

డిండి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కే రాఘవి, ఎస్ శ్రేష్ఠ, బీ అభినయశ్రీ ఎంపికైనట్లు ఆయన తెలిపారు. హాలియాలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన వీరిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

యాదవులు అన్నిరంగాల్లో రాణించాలి



సదర్ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బడుగుల లింగయ్యయాదవ్, నెల్లికంటి సత్యం, కాసం వెంకటేశ్వర్లు, జక్కలి ఐలయ్యయాదవ్, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, బూడిద లింగయ్యయాదవ్



దున్నపోతును ఆడిస్తున్న రాజగోపాల్‌రెడ్డి, దూదిమెట్ల బాలరాజుయాదవ్

సదర్ సమ్మేళనంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):గొల్ల, కురుమలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే తన లక్ష్యమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి నల్లగొండ జిల్లా మునుగోడు హైస్కూల్ ఆవరణలో గొల్ల, కురుమల బలగం అధ్వర్యంలో నిర్వహించిన సదర్ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి, గొల్లకురుమలనుద్దేశించి ప్రసంగించారు. నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో గొల్ల, కురుమల భవన నిర్మాణానికి తన సహాయ సహకారాలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. సదర్ ఉత్సవాలను అధికారంగా నిర్వహిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. గొల్ల కురుమలు నీతి నిజాయితీకి కట్టుబడి ఉంటారని తెలిపారు. వెనుకబడిన వర్గాల్లో యాదవులు ఆర్థికంగానే కాదు రాజకీయ, సామాజిక రంగాల్లో రాణించాల్సిన అవసరముందన్నారు. యాదవులు తమ లక్ష్యసాధన కోసం ఐక్యంగా రాణించాలని పిలుపునిచ్చారు. అందుకు వారికి అండగా ఉంటానన్నారు. వారు ఆదర్శంగా ఉండాలని సూచించారు. మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గంలో యాదవుల సంక్షేమ భవన నిర్మాణానికి తనవంతుగా రూ.10లక్షలు విరాళం ఇస్తానని ప్రకటించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, యాదవ్ సంఘం నేతలు దూదిమెట్ల బాలరాజుయాదవ్, జక్కలి ఐలయ్యయాదవ్‌లు సమాజంలో గొప్ప పాత్ర పోషిస్తున్న యాదవులు రాజకీయంగా ఎదిగేందుకు సమష్టిగా చైతన్యం కావాలన్నారు. పశుసంపద అభివృద్ధి కోసం ఉపాధి రంగాల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ముందుగా గ్రామ ప్రధానవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. డోల్ వాయిద్యాలు, మహిళల కోలాటాలు, వివిధ వేషధారణల నడుమ దున్నపోతులతో ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో గొల్లకురుమల సంఘాల నాయకులు బూడిద లింగయ్య, కర్నాటి స్వామియాదవ్, గోవర్ధన్, అయోధ్య, చెరుపల్లి వెంకటేశం, తీర్పారీ వెంకటేశ్వర్లు, సాగర్ల లింగస్వామి, తాటికొండ సైదులుమాల్లా యాదన్న, నారాయణ, బీసం కృష్ణ, ఆంజనేయులు, నేరటి మల్లేష్, బీసం విజయ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ప్రణవి

మోటకొండూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరుకు చెందిన విద్యార్థిని ఉండాడి ప్రణవి ఎంపికైంది. స్థానిక ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ప్రణవి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఈ నెల 8 నుంచి నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-14 హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయుడు రఘురాంరెడ్డి తెలిపారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని మహాసముంద్, దుర్గ్‌లలో ఈ నెల 23 నుంచి 30వరకు జరిగే 68వ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ప్రణవిని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నాతి మల్లేశం, ఉపాధ్యాయులు రాజగోపాల్, ప్రభాకర్‌రెడ్డి, గంధమల్ల విశ్వరూపం, భాగ్యశ్రీ, భవాని, రాజశేఖర్ సుధారాణి, శ్రీలత, రమేష్ అభినందించారు. అదేవిధంగా ప్రణవి ఎంపికపై తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

మట్టపల్లి హుండీ కానుకల లెక్కింపు

మఠంపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం హుండీ కానుకలను లెక్కించారు. ఐదు నెలలకు ప్రధాన హుండీద్వారా రూ.12,99,226 నిత్య అన్నదానం ద్వారా రూ.94,110 కలిపి రూ.13,93,336ల ఆదాయం వచ్చినట్లు ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్ కుమార్, ఈవో నరికొండ నవీన్‌లు తెలిపారు.

సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి



సమావేశానికి హాజరైన అధికారులు

(5వ పేజీ తరువాయి)

కృషి చేయాలని కోరారు. ప్రతీ మూడు నెలలకో సారి దిశకమిటీ సమావేశాలు నిర్వహించాలని, సమావేశానికి ముందే ఎజెండాను వివరిస్తే సార్థకత వస్తుందని, ఆ దిశగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మూడు వారాల్లోనే జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను గాడిలో పెట్టడంతో పాటు, పథకాల అమలుకు విస్తృతంగా కృషి చేస్తున్నారని కలెక్టర్ ఇలా త్రిపాఠిని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశంసించారు.

ఫ్యాక్టరీ నిర్మించకపోతే కాంట్రాక్ట్ రద్దుచేయాలి

నల్లగొండ జిల్లాలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని పతంజలి సంస్థ నాలుగేళ్లయినా చేపట్టకపోవడంపై మంత్రి తుమ్మలనాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎనిమిది నెలల్లో ఫ్యాక్టరీ నిర్మించకపోతే ఆ సంస్థ కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని సూచించారు.

ధాన్యం కొనుగోళ్ల విధానం బాగాలేదు



ధాన్యం కొనుగోళ్ల విధానం సరిగా లేదు. కేంద్రాల వద్ద ఏఈవోలు, ఏపీఎంలు ఉండడం లేదు. దీంతో పాటు మిల్లులను కేటాయించకపోవడంతో ధాన్యం దించుకోవడంలో మిల్లర్లు సతాయిస్తున్నారు. అధికారులు పర్యవేక్షించాలి.

- మందుల సామేల్, ఎమ్మెల్యే, తుంగతుర్తి

కేంద్ర పథకాలు అమలుకు కార్యాచరణ



కేంద్రం నుంచి అమలయ్యే 92 పథకాలను జిల్లాలో ఎలా వినియోగించుకోవాలనే విషయంలో కలెక్టర్ నేతృత్వంలో అధికారులు పూర్తిగా కార్యాచరణ తయారు చేయాలి. మంత్రులు, ఎమ్మెల్యేల సూచనలను పరిగణనలోకి తీసుకొని కార్యక్రమాలు రూపొందించి పూర్తిస్థాయిలో ఈపథకాలను సద్వినియోగం చేసుకునేందుకు కృషి చేస్తా. తదుపరి సమావేశం నాటికి అన్ని పథకాలకు సంబంధించి పూర్తిస్థాయి కార్యాచరణ రూపొందించి ఇస్తే, తాను, సహచర ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి కేంద్రం నుంచి నిధులు తెస్తాం. - కుందూరు రఘువీర్ రెడ్డి, ఎంపీ

పంటలకు పరిహారం ఇప్పించాలి



అకాలవర్షంతో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో వరి పంట దెబ్బతింది. పంట చేతికొచ్చే సమయంలో ఈ వానలతో రైతులు నష్టపోయారు. నష్టపోయిన రైతులకు పరిహారం మిప్పించేందుకు వ్యవసాయశాఖమంత్రి చొరవ తీసుకోవాలి.

- కుందూరు జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్యే నాగార్జునసాగర్

రైతులు అవస్థలు పడకుండా చూడాలి



వరికోతల సమయంలో రైతులకు చాలా ఇబ్బంది కలుగుతోంది. కల్లాలు, గోదాములు అందుబాటులో లేకపోవడం, ఆరబెట్టుకుంటే గిట్టుబాటు ధర వస్తుందనే అవగాహన లేకపోవడంతో మిల్లుల వద్దకు పచ్చిధాన్యం తెచ్చి రైతులు అవస్థలు పడుతున్నారు. ఇదే అదనుగా మిల్లర్లు సైతం రైతులకు ధర ఇవ్వకుండా సతాయించడం ఆరంభంలో ఇబ్బంది కలిగించింది. కలెక్టర్ చొరవతో, మేమంతా కలిసి ఆసమస్యను పరిష్కరించాం. అయితే కోతల సమయంలో రైతులకు శాశ్వతంగా ఇబ్బందిలేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలి

- బత్తుల లక్ష్మారెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే

జిల్లా అభివృద్ధికి అవసరమైన కార్యాచరణ



కేంద్ర పథకాలతో జిల్లా సమగ్రాభివృద్ధికి అవసరమైన కార్యాచరణ రూపొందిస్తున్నాం కమ్యూనిటీ ఫార్మింగ్, వెజిటేబుల్ ఫార్మింగ్‌కు జిల్లాలో ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని, అదేవిధంగా తాండూరు కంది రకాన్ని ఇక్కడ కూడా మార్కెటింగ్ సదుపాయాలతో కలిపి పంట విస్తీర్ణం పెంచేందుకు చర్యలు చేపడతున్నామని వివరించారు. కేంద్రం ద్వారా వచ్చే పథకాలన్నింటినీ జిల్లాలో ఎలా వినియోగించాలనే దానిపై మంత్రులు, ఎమ్మెల్యేల సూచనలతో సరైన ప్రణాళికను రూపొందించి అమలు చేస్తాం - ఇలా త్రిపాఠి, కలెక్టర్, నల్లగొండ

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర పథకాల నుంచి వచ్చే నిధులను సాధిస్తాం, వాటి సద్వినియోగానికి చర్యలు తీసుకోని సరైనప్రణాళికలు రూపొందించాలి. తన పార్లమెంటు ఆరు జిల్లాల్లో విస్తరించి ఉందని, దిశ కమిటీల ద్వారా అన్నిజిల్లాల్లో తన పార్లమెంటు పరిధిలో పనులు చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు ఇవ్వాలి

- చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎంపీ , భువనగిరి

ధాన్యం దిగుమతిలో కొర్రీలు లేకుండా చూడాలి



కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం మిల్లులకు తీసుకెళ్లాక, అక్కడ తేమ ఎక్కువుందని, తాలు ఉందని పేర్కొంటూ మిల్ల ర్లు కొర్రీలు పెడుతుండడంతో రైతులకు ఇబ్బంది కలుగుతోంది. దీన్ని నివారించేందుకు కలెక్టర్ చర్యలు చేపట్టాలి. ఈఒక్క విషయం మిన హా రైతులకు ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందుల్లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ప్రశంసనీయం. - వేముల వీరేశం, ఎమ్మెల్యే, నకిరేకల్

చికెన్ ధరలు



జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.125	200	230
సూర్యాపేట	రూ.120	180	200
నల్లగొండ	రూ.132	194	214

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	585.10
టీఎంసీలు	297.7235
ఎడమకాల్వకు నీటి విడుదల	4,949
కుడికాల్వకు	10,040
విద్యుత్ కేంద్రం ద్వారా	29,069
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	31,315
అవుట్‌ఫ్లో	46,758 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	43.45 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	2 వేల క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	00

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.50 అడుగులు
టీఎంసీలు	4.33
కాల్వలకు	24.43 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	315.97 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	68.91 క్యూసెక్కులు

బైక్‌లను ఢీకొట్టిన కారు.. ఇద్దరికి తీవ్ర గాయాలు



సంఘటనా స్థలంలో బైక్‌లు, కారు

వేములపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కారు, బైక్‌లను ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండలకేంద్రంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పుట్టల చిన నర్సింహ మండల కేంద్రంలో బైక్‌పై రోడ్డును క్రాస్ చేస్తున్నాడు. అదే సమయంలో గుంటూరు జిల్లా నర్సరావుపేటకు చెందిన కె.హరిబాబు హైదరాబాద్ నుంచి కారులో నర్సారావుపేటకు వెళ్తున్నాడు. క్రమంలో చిన నర్సింహ బైక్‌ను ఢీ కొనడంతో అతడి బైక్‌తో సహా కారు రోడ్డు అవతలి వైపునకు దూసుకెళ్లి బైక్‌వైపు వెళ్తున్న మాతంగి సుధీర్‌ను ఢీకొట్టాడు. ఈప్రమాదంలో చిననర్సింహ, సుధీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి ఇద్దరిని 108లో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

జమ్మనకోట వద్ద మృతదేహం లభ్యం

తిరుమలగిరి(సాగర్), నవంబరు 22(ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా తిరుమగిరి (సాగర్) మండలంలోని జమ్మనకోట వద్ద శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన కొందరు జాలర్లు చేపలు పట్టడానికి సమీపంలోని కృష్ణానదికి వెళ్లారు. ఈ క్రమంలో ఒడ్డున నీళ్లలో ఒక మృతదేహం తేలియాడుతూ కనిపించింది. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 50 సంవత్సరాల వయస్సు కలిగి ఉన్న మగ వ్యక్తి నీలిరంగు గీతలు కలిగిన చొక్కా, ఆరెంజ్ బనియన్, తెలుపురంగు పంచ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి రెండు కాళ్లకు నైలాన్ తాడు కట్టి ఉండడంతో అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి చనిపోయి సుమారు మూడురోజులు కావడంతో మృతదేహం కుళ్లిపోయి ఆసుపత్రికి తరలించే వీలు లేకపోయింది. దీంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించి సమీపంలోనే పోలీసులు ఖననం చేసినట్లు తెలిపారు. సమాచారం తెలిసిన వారు 8712670199 నంబర్‌కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

అర్వపల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం సీతారాంపురంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి మండలం వెల్లుపల్లి గ్రామానికి చెందిన గైగుల్లా వీరభద్రయ్య (55)గురువారం రాత్రి టీవీఎస్ మోపెడ్‌పై సూర్యాపేట వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సీతారాంపురం గ్రామ సమీపం లో వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వీరభద్రయ్య తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వీరభద్రయ్య మృతదేహాన్ని తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టమ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వీరభద్రయ్య కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గురుకులంలో పారిశుధ్య పనులు



కంప చెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

కేతేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టు వద్ద గల బాలుర బీసీ గురుకుల పాఠశాలలో రెండు రోజులుగా కంపచెట్ల తొలగింపు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి ఇటీవల పాముకాటుకు గురైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం పాఠశాలను సందర్శించి జిల్లా కలెక్టర్ త్రిపాఠి, గురుకుల పాఠశాలల రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మద్దిలేటి తదితర అధికారులు భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, పాఠశాల చుట్టూ ఉన్న పెరిగిన కంప చెట్లు, పేరుకుపోయిన మురుగు, పాడుబడిన మూసీ క్వార్టర్లను తొలగించాలని పాఠశాల ప్రిన్సిపాల్ ధనమ్మ, గ్రామ పంచాయతీ కార్యదర్శి హరీష్‌ను ఆదేశించారు. వారం రోజుల తర్వాత పాఠశాల మళ్లీ సందర్శిస్తానని అప్పటికీ పరిస్థితిలో మార్పు లేకపోతే కఠినచర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. దీంతో పాఠశాల, గ్రామ పంచాయతీలకు చెందిన పారిశుధ్య కార్మికులు రెండు రోజులు శ్రమించి పాఠశాల ఆవరణలో అపరిశుభ్రతను తొలగించి పారిశుధ్యాన్ని మెరుగుపరిచారు. మరోవైపు పంచాయతీ నిధులతో ఎక్స్‌కవేటర్‌ను ఉపయోగించి పాఠశాల పరిసరాల్లో పెరిగిన కంప చెట్లు, పాడుబడిన మూసీ క్వార్టర్ల మధ్యలో పేరుకుపోయిన మురుగునీటిని తొలగించారు. డ్రైనేజీ ఏర్పాటు పనులు నిర్వహిస్తున్నారు. ఈ పనులను ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, పాఠశాల ప్రిన్సిపాల్ ధ నమ్మ పర్యవేక్షిస్తున్నారు. మరో రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో కంప చెట్లు, పిచ్చిమొక్కల తొలగింపు పనులు పూర్తవుతాయని వారు తెలిపారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి ఊంజల్ సేవ



అద్దాల మండపంలో ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రాకార మం డపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయం త్రం ప్రధా నాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి, సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగవ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.35,71,152ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కాగా, కార్తీక మాసం సందర్భంగా కొండకింద వ్రత మండపాలో జంటలు సత్యదేవుని వ్రతాలు, కార్తీక దీపారాధనలో పాల్గొని మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

నృసింహుడి సన్నిధిలో మంత్రులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, దనసరి అనసూయ (సీతక్క), భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆలేరు, భువనగిరి ఎమ్మెల్యేలు బీర్ల అయిలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వారికి వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఈవో ఏ.భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదాలను అందజేశారు. అంతకుముందు కొండకింద వైకుంఠద్వారం వద్ద ప్రభుత్వ విప్ అయిలయ్య మంత్రులకు శాలువా కప్పి సన్మానించారు. అంతకుముందు అర్చకులు మంత్రులకు ఆలయ మర్యాదలతో స్వా గతం పలికారు. కొండకింద మూడో ఘాట్ రోడ్డు వద్ద రూ. 210కోట్ల వ్యయంతో మిషన్ భగీరథ పైలాన్‌కు మంత్రులు శంకుస్థాపన చేశారు.

హిందుస్థాన్ గోదాంలో అగ్ని ప్రమాదం



బీబీనగర్ శివారులో హిందుస్థాన్ గోదాం నుంచి వెలువడుతున్న పొగ

బీబీనగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ శివారులోని హిందుస్థాన్ సానిటరి వేర్ కంపెనీ గోదాంలో శుక్రవారం భారీ అగ్ని ప్ర మాదం జరిగింది. కంపెనీ వర్గాలు, ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నరావులపల్లి గ్రా మంలో గల హిందుస్థాన్ సానిటరి వేర్ కంపెనీలో ఉత్పత్తి అయ్యే సానిటరి ప్రొడక్ట్స్‌ను బీబీనగర్ శివారులోని బ్రాహ్మ ణపల్లి రోడ్డులోని గోదాంలో నిల్వ ఉంచి అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వరకు సరఫరా చేస్తారు. కాగా గోదామ్‌ను ప్రహరీ ఆనుకుని అవతలి వైపున ఉన్న నూలి విజయ మనోహర్ రావుకు చెందిన పొలంలో వరి కొయ్యలు తగుల బెడు తుండగా గడ్డి కాలుతూ గోదాం ప్రహరీ ఆను కుని ఎండి పోయిన కొబ్బరిచెట్టు కొమ్మలకు మంటలు అంటుకున్నాయి. దాం తో చెట్టు కూడా పూర్తిగా కాలిపోయి ఇవతలి వైపున గోదాంలో భద్ర పర్చిన సానిటరి ప్రొడక్ట్ కాటన్‌బాక్సులకు నిప్పురవ్వలు అంటుకున్నాయి. దాంతో గాలికి మంటలు వ్యాప్తించి దట్టమైన పొగ రావడంతో గమనించిన కార్మి కులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. అందుబాటులో ఉన్న క్యాన్ల ద్వారా నీళ్లతో మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికి అదుపులోకి రాక పోవడంతో ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. దాంతో భువనగిరి నుంచి వచ్చిన రెండు ఫైరింజన్లతో సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. ఈ ప్రమాదంలో విలువైన బాట్ సబ్బులు, సానిటరి సామగ్రి కాలిపోయి తీవ్ర నష్టం వాటి ల్లింది. నష్టం కోట్లల్లో ఉంటుందని కాకపోతే ఇన్సూరెన్స్ సిబ్బంది పరిశీలించిన తర్వాతే నష్టం ఎంతో స్పష్టంగా చెప్ప గలమని కంపెనీ జీఎం తెలిపారు.

నాకు న్యాయం చేయండి

- నల్లగొండ డీఈవో భిక్షపతి భార్య మాధవి

నల్లగొండ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నాకు న్యాయం చేసి నా భర్తతో కలిసి ఉండేలా చూడాలని ఇదే విషయాన్ని కోర్టులో సైతం చెప్పానని నల్లగొండ డీఈవో భార్య మాధవి తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని జడ్పీ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 14 ఏళ్ల క్రితం పెద్దల సమక్షంలో భిక్షపతిని వివాహం చేసుకున్న తనకు వివాహమైన ఏడాదికి విడాకులు కావాలని ఆయన కోర్టు ఆశ్రయించినట్లు చెప్పారు. తాను 14 ఏళ్లుగా కోర్టు కేసు విషయమై ఒంటరిగా పోరాటం చేస్తున్నానని, అయితే కోర్టులో కేసు ఉండగానే రెండో వివాహం చేసుకున్నాడని ఆరోపించారు. తీర్పుకోసం కోర్టు చుట్టూ తిరుగుతునున్నానని, అనుమానం రావడంతో గురువారం నల్లగొండకు వచ్చి తెలుసుకోగా మరో మహి ళతో వివాహేతర సంబంధం పెట్టుకుని కాపురం చేస్తున్నాడని తెలియడంతో ఇంటి వెళ్లి నిలదీశానని ఆవేదన వ్యక్తం చేశారు. నాకు అమ్మనాన్న ఇద్దరులేరు ఒంట రిగా ఉంటున్నా. ప్రజా సంఘాలు అండగా నిలవడంతో బయటకు వచ్చినట్లు చెప్పారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని, అవసరమైతే జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.. సమావేశంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి, విద్యా వంతుల వేదిక అధ్యక్షుడు పందు ల సైదులు, నాయకులు బకరం శ్రీను, మానుపాటి భిక్షమయ్య, మాధవి పెద్దమ్మ లలిత, వేణు, తదితరులున్నారు.

డీఈవోపై దాడి ఘటనలో నలుగురిపై కేసు

నల్లగొండ క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండలో డీఈవో భిక్షపతి ఇంటికి వెళ్లి దుర్భాషలాడడంతో పాటు దౌర్జన్యానికి పాల్పడి దాడి చేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్‌ఐ రావుల నాగరాజు తెలిపారు. ఈనెల 21న డీఈవో భిక్షపతి ఇంట్లోకి అనుమతి లేకుండా అక్రమంగా ప్రవేశించి డీఈవోను దూషించడంతో పాటు దౌర్జన్యానికి పాల్పడినట్లు చెప్పారు. కేసు కోర్టు పరిధిలో ఉన్న సమయంలో డీఈవో ఇంటిపైకి వెళ్లి దౌర్జన్యం చేశారని పేర్కొన్నారు. డీఈవో భిక్షపతి ఫిర్యాదు మేరకు కాల్వ మాధవితో పాటు ఆమె బంధువులైన మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కబేళాకు తరలిస్తున్న 15 పశువులు పట్టివేత



పట్టుబడిన పశువులు

కోదాడ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కబేళాలకు తరలిస్తున్న పశువులను పట్టుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా, పాయకరావుపేటకు చెందిన కట్టమురి కార్తీక్ పాయకరావుపేట సంత నుంచి టాటా దోస్త్ వాహనంలో తొమ్మిది ఆడ దూడలు, ఆరు మగదూడలను ఎక్కించి హైదరాబాద్ కబే ళాకు తరలిస్తున్నాడన్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వ ద్ద చెక్‌పోస్టు వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా పశువులను పట్టుకున్నట్లు చెప్పారు. వాటిని కట్టంగూరు గోశాలకు తరలించినట్లు తెలిపారు. కట్టమురి కార్తీక్, రమణపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



అంజయ్య(ఫైల్)

చింతపల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకొంది. చింతపల్లి ఎస్‌ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం..నల్లగొండ జిల్లా మర్రిగూడ మం డలం తిరుగండ్లపల్లి గ్రామానికి చెందిన ఉడుతల అంజయ్య(68) వ్యక్తిగత పనుల నిమిత్తం మాల్ నుంచి చింతపల్లి వైపుకు ఎలక్ట్రికల్ వాహనంపై వెళ్తున్నారు. హైదరాబాద్ నుంచి అతివేగంగా కారు గొడుకొండ్ల రిజర్వాయిర్ సమీపంలో వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అంజయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు శవపరీక్ష నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పొదుపు సంఘం డబ్బులు జమ చేయలేదు

నిడమనూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం గుంటుకగూడెం గ్రామానికి చెందిన అంబేద్కర్ సమభావన సంఘం పొదుపు డబ్బులు చెల్లించినా బుక్ కీపర్ బ్యాంకులో జమ చేయలేదని శుక్రవారం సంఘం సభ్యులు శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. తాము 2021లో రూ.6 లక్షలు బ్యాంకు నుంచి రుణం తీసుకున్నామని ఇందుకు ప్రతినెలా రూ. 15 వేల చొప్పున 24 నెలలు రూ.5.50 లక్షలు సంఘబంధం బుక్‌కీపర్ గుడిసె జయమ్మకు చెల్లించినట్లు పేర్కొన్నారు. ఆమె బ్యాంకులో జమ చేయకుండా వాడుకున్నదని విచారణ చేసి న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు.

ఎస్సీ బాలికల హాస్టల్ తనిఖీ

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భూదాన్ పోచంపల్లి పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని తహసీల్దారు మహేందర్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా ? అని విద్యార్థులను అడిగి వివరాలు సేకరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పాత డబ్బాకొట్లు

- రాత్రి వేళల్లో గంజాయి సైతం విక్రయం



వ్యాపారాలు నడవకపోవడంతో వృథాగా వదిలేసిన డబ్బా కొట్టు


రామగిరి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో రోడ్ల వెంట చిరు వ్యాపారుల డబ్బాకొట్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. డబ్బాకొట్లలో కొందరు వ్యాపారాలు నిర్వహిస్తుండగా మరి కొందరు వ్యాపారాలు నడవకపోవడంతో వాటిని వృథాగా వదిలేశారు. అయితే కొందరు మందుబాబులు రాత్రి సమయాల్లో ఈ డబ్బాకొట్ల వెనుకాల మందు తాగుతున్నారు. గంజాయి క్రయవిక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం. మరికొన్ని చోట్ల అసాంఘిక కార్యక్రమాలు కూడా చోటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్న పట్టించుకోవాల్సిన పోలీస్ యంత్రాంగం చోద్యం చూస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీస్ యంత్రాంగం స్పందించి గస్తీలు నిర్వహించాలని పలువురు పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మురుగు కాల్వల ఆక్రమణ

కొందరు చిరు వ్యాపారులు వ్యాపారం నిర్వహించుకునేందుకు రోడ్ల పక్కనే ఉండే మురుగు కాల్వలు ఆక్రమించి వాటిపై డబ్బాకొట్లు ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారు. దీంతో ఆ చిరువ్యాపారుల దగ్గరికి వచ్చే వినియోగదారుల వాహనాలు రోడ్లపైనే ఉండడంతో రోడ్లు ఇరుకుగా మారడంతో పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. ఈ క్రమంలో ట్రాఫిక్ పోలీసులు వాహనాలు రోడ్డుపై ఉన్నాయంటూ ఆయా వాహనాల ఫొటోలను తీసి జరిమానాలు విధిస్తున్నారు. ఇదీలాఉండగా మరికొందరు వ్యాపారులు మునిసిపల్ స్థలాలను అక్రమించుకునే ప్రయత్నంలో భాగంగానే డబ్బాకొట్లను ఏర్పాటు చేసుకున్నట్లుగా తెలుస్తోంది. అంతేకాకుండా కాల్వలపైనే డబ్బాకొట్లు ఏర్పాటు చేయడంతో మోరీలో ఉండే వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు తీసేందుకు వీలు కావడంలేదు.

దీంతో వర్షాకాలంలో వరదనీరు, మురుగునీరంతా, రోడ్లపైకి పొంగి పొర్లడంతోపాటు పాదచారులు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి మోరీలను, వరదకాల్వలు ఆక్రమించి ఏర్పాటు చేసిన డబ్బా కొట్లు తొలిగించాలని పలువురు కొరుతున్నారు.

పెట్రోలింగ్ చేస్తాం



నల్లగొండ పట్టణంలో పాతడబ్బా కొట్టుచాటున జరుగుతున్న వ్యవహారంపై పెట్రోలింగ్ మరింత పెంచుతాం. అసాంఘిక కార్యక్రమాలపై నిఘా పెట్టి చర్యలు తీసుకుంటాం .

- శివరాంరెడ్డి, డీఎస్పీ, నల్లగొండ

పరిశీలన చేస్తాం



వరద కాల్వలు ఆక్రమించి ఏర్పాటు చేసిన డబ్బా కొట్లపై సర్వే చేపడుతాం ఎవరైన వరదకాలవలు ఆక్రమిస్తే వారికి నోటీసు లు ఇచ్చి పోలీస్ సహకారంతో తొలిగింపచేస్తాం.

- సయ్యద్ ముసాబ్ అహ్మద్, కమిషనర్

సమాచారం

మహాసభలను విజయవంతం చేయాలి

వలిగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్‌లో డిసెంబర్ 15, 16, 17 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మాటూరి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్యలు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఎం మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, నాయకులు తుర్కపల్లి సురేందర్, మెరుగు వెంకటేశం, కూర శ్రీనివాస్, వాకిటి వెంకట్‌రెడ్డి, కందాడి సత్తిరెడ్డి, మొగిలిపాక గోపాల్, చీర్క శ్రీశైలంరెడ్డి, కిష్టయ్య పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

వలిగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరూరు గ్రామ శ్రీ మల్లిఖార్జున గొర్రెల పెంపకందారుల సహకార సంఘం నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కసిరబోయిన లింగయ్య, ఉపాధ్యక్షులుగా జినుకల వెంకటేశం, కార్యదర్శిగా తుమ్మల సంతోష్‌కుమార్, డైరెక్టర్లగా మర్రి ముత్యాలు, బుర్ర అనిత, మొదాల సుధాకర్, చెముడాల మంజుల ఎన్నికైయ్యారు.

సామూహిక వనభోజనాలు

వలిగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్ర గాంధీనగర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం సామూహిక వనభోజనాలు నిర్వహించారు. ఆ కాలనీ కుటుంబసభ్యులంతా గ్రామం చివరన పచ్చనిచెట్ల కింద వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో గాంధీనగర్ కాలనీ అధ్యక్షుడు కొండపర్తి బాలచారి, సభ్యులు దశరథ, ఆంజనేయులు, చంద్రయ్య, నారాయణ పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డులో అక్రమ కట్టడాలు

● కొరవడిన అధికారుల పర్యవేక్షణ



భువనగిరి బైపాస్ రోడ్డులో అనుమతులు లేకుండా సాగుతున్న కట్టడాలు

భువనగిరి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భువనగిరి బైపాస్ రోడ్డు వెంట అక్రమ నిర్మాణాల జోరు సాగుతోంది. వ్యాపారానికి అనువుగా ఉన్న బైపాస్ రోడ్డుపై ఇటీవల నిర్మాణాలు ఊపందుకున్నాయి. నివాస గృహాలతో పోలిస్తే వాణిజ్య సముదాయాల నిర్మాణాలే అధికంగా సాగుతున్నాయి. నిజానికి గృహ నిర్మాణాల కంటే వాణిజ్య సముదాయాల నిర్మాణాలతోనే పన్నుల రూపకంలో మునిసిపాలిటీకి అధిక ఆదాయం లభిస్తుంది. కానీ పలు నిర్మాణాలు అనుమతులు లేకుండానే సాగుతున్నట్లు ప్రచారం అవుతోంది. పట్టణంలో అనుమతులు లేకుండా నివాసం కోసం పలువురు 1, 2 గదుల ఇళ్లను నిర్మించుకున్నా నిబంధనల పేరిట చర్యలు తీసుకుంటున్న మునిసిపల్ అధికారులు బైపాస్ రోడ్డు వెంట అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వాణిజ్య కట్టడాలపై ఉదాసీనత చూపుతున్నట్లు ప్రచారం అవుతోంది. మరి కొందరు నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ అధికారికంగా నిర్మాణ అనుమతి ఉత్తర్వులు రాకుండానే నిర్మాణ పనులు చేపడుతుండడం గమనార్హం. ఈ మేరకు మునిసిపల్ పట్టణ ప్రణాళిక శాఖ అధికారి నరేష్ స్పందిస్తూ బైపాస్ రోడ్డు వెంట సాగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని, అనుమతులు వచ్చాకే నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉంటుందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన భవనాల యజమానులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పిలాయిపల్లి గ్రామానికి చెందిన నిరుపేద ఎరుకల కుటుంబీకులపై దాడి జరిపిన వారిని వెంటనే అరెస్టు చేయాలని తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కూతాడి సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం బాధితులకు మద్దతుగా ఎరుకల సంఘం నాయకులతో కలిసి భూదాన్‌పోచంపల్లిలో పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ భాస్కర్‌రెడ్డికి పిటిషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిలాయిపల్లి గ్రామంలో 26ఏళ్లుగా గిరిజన ఎరుకల కుటుంబం కుతాటి ప్రేమలత యాదగిరి పూరి గుడిసె వేసుకుని జీవనం సాగిస్తున్నారని అన్నారు. ఈనెల 19న అదే గ్రామానికి చెందిన గుడిసె భూషణ్, పెరుమాండ్ల దానయ్య, కట్ట భూపాల్‌రెడ్డి, బాతుక భిక్షపతి, కట్ట మధుసూదన్‌రెడ్డి, బందారపు విక్రమ్, తోట బాబు, బందారపు దర్శన్, బందారపు పెద్ద నర్సింహ, బీరెడ్డి రమణారెడ్డి అనే వ్యక్తులు ఎక్స్‌కవేటర్‌తో గుడిసెను తొలగించారని ఆరోపించారు. వీరిపై భూదాన్‌పోచంపల్లి పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశామని తెలిపారు. కాగా, శుక్రవారం మళ్లీ అదే 10 మంది మళ్లీ కూలిన గుడిసెను పూర్తిగా అక్కడి నుంచి తొలగించారని తెలిపారు. గిరిజన ఎరుకల కుటుంబంపై జరిగిన దాడిని అందరూ ఖండించాలని, నిందితులను అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కౌన్సిలర్ దేవరాయ కుమార్, ఎరుకల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుతాటి భాస్కర్, నాయకులు దేవరాయ నర్సింహ, అంగడి ఈదయ్య, కుతాడి మహేష్, యాదగిరి. శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎరుకల సంఘం నాయకుడు సురేష్

95శాతం పూర్తి


(5వ పేజీ తరువాయి): అవగాహన కూడా కల్పించలేదని సమాచారం. కొన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లోని డాటా ఎంట్రీ ఆపరేటర్లు సర్వే ఆన్‌లైన్ ప్రక్రియను చేపడుతున్నప్పటికీ ప్రైవేట్ ఆపరేటర్ల కోసం వెతుకుతున్నట్లు ముఖ్యంగా కంప్యూటర్‌పై అవగాహన ఉన్న విద్యార్థులను ఆపరేటర్లుగా నియమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎడిట్ ఆప్షన్ లేదు

కుటుంబ సర్వేలో డాటా ఎంట్రీ ప్రధానం కానుంది. ఆపరేటర్లు ఒకసారి సబ్మిషన్ చేశాక ఎడిట్ ఆప్షన్ లేదు. దీంతో డాటా ఎంట్రీని ఆపరేటర్లు అత్యంత జాగ్రత్తగా చేయాల్సి ఉండటంతోపాటు అధికారులు ఆపరేటర్ల సందేహాలను వెంటవెంటనే నివృత్తి చేయాల్సి వస్తుంది. లేదంటే పలు కారణాలతో డాటా ఎంట్రీ ఆపరేటర్లు చేసే స్వల్ప పొరపాట్లు సంబంధిత కుటుంబాల వివరాలు ప్రభుత్వం వద్ద తప్పుడుగా నమోదయ్యే అవకాశాలున్నాయి. దీంతో ఆపరేటర్లకు తప్పనిసరిగా ఒక రోజు శిక్షణ ఇవ్వాలని పలువురు అంటున్నారు. ఇదిలా ఉంటే డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక్కో ఫారానికి ప్రభుత్వం రూ.30 చెల్లించనుంది. అయితే ఒక్క లాగిన్ ద్వారా ఒక ఆపరేటర్ రోజుకు 25 ఫాంల వివరాలను మాత్రమే నమోదు చేయాల్సి ఉంటుంది.

మార్కెట్ యార్డు నిర్మాణంపై కదలిక వచ్చేనా?

(5వ పేజీ తరువాయి): నిర్మించే మార్కెట్ యార్డుకు నిధులు మంజూరు కోసం వేచి చూస్తున్నారు.



ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

భువనగిరి వ్యవసాయ మార్కెట్ యార్డును అత్యాధునికంగా హంగులతో నిర్మించే ప్రతిపాదనలను పరిశీలించి, నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. ప్రస్తుతం గంజ్‌లో ఉన్న మార్కెట్ యార్డును బీబీనగర్ మండలం గూడూరులోని సర్వే నెం.69లోని 17 ఎకరాల్లో మోడల్ మార్కెట్ యార్డును నిర్మించేందుకు గత ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. గతంలో కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.1.45కోట్లు మంజూరు చేసింది. మార్కెట్ యార్డు నిర్మాణంలో గతంలో తీసుకున్న నిర్ణయాలపై మార్కెటింగ్‌శాఖ అధికారులతో చర్చించి, నిధులు మంజూరు కోసం ప్రభుత్వాన్ని కోరుతాం.

-కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే

న్యాయవాద రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలి

భువనగిరి గంజ్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని, దాడులను అరికట్టాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం భువనగిరిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించే విధంగా చట్టాలను తీసుకరావాలని అన్నారు. కొత్తగా న్యాయవాద వృత్తిలో వచ్చిన జూనియర్ న్యాయవాదులకు 5000వేలు స్టైఫండ్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఐలు జిల్లా సహాయ కార్యదర్శి బొల్లపల్లి కుమార్, సీనీయర్ న్యాయవాది బొమ్మ వెంకటేష్, కోశాధికారి బొడ్డు కిషన్, జిల్లా కమిటి సభ్యులు యాదాసు యాదయ్య, ముద్దసాని చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన నాయకులు

వలిగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మండల బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్‌రెడ్డి, ఎస్సీసెల్ జిల్లా నాయకులు బట్టు దాసురావు, నాయకులు వెల్మకన్నె వెంకటేష్ పాల్గొన్నారు.

వైభవంగా ఉర్సు ఉత్సవాలు

భువనగిరి గంజ్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భువనగిరి పట్టణంలోని సమ్మద్ చౌరస్తా హజరత్ లాల్‌షావలీ బాబా రహెమతుల్లాహ్ అల్లై దర్గా పంఖ ఊరేగింపు ముతవల్లి దర్గా సేవకులు ఎండీ.ఇంతియాజ్, ఎండీ.ఇస్తియాక్ ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అనతంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎండీ.తాహెర్, ఎండీ.సలావుద్దీన్, ఎండీ పయాజ్, రెయ్యాన్, మొఖ్తార్, కాఎరానాజ్, ఎండీ.అఖీల్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఇంటింటి సర్వే నమోదు

చౌటుప్పల్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం ఇంటింటి సమగ్ర సర్వే డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ ప్రారంభమైంది. ఈ డేటా ఎంట్రీ 10 రోజుల పాటు కొనసాగనుందని కమిషనర్ కె.నర్సింహారెడ్డి, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఇంటింటి సర్వేను పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లు జరగకుండ నిర్వహించినట్టు వారు తెలిపారు. మునిసిపల్ పరిధిలో 88 మంది ఎన్యూమరేటర్లు ఇంటింటికి తిరిగి 8,914 కుటుంబాలకు చెందిన సర్వేను పూర్తి చేశారు. మరోక 209 కుటుంబాలకు చెందిన సర్వేను మరో రెండు రోజుల్లో పూర్తి చేయనున్నారు. 9 మంది సూపర్ వైజర్ లు సర్వేను పర్యవేక్షిస్తున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొండమడుగు నర్సింహ

భువనగిరి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ అన్నారు. శుక్రవారం భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్, బీజేపీ పూర్తిగా విఫలమయ్యాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన కోసం సీపీఎం అనేక పోరాటాలు చేస్తున్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో అనేక వైషమ్యాలను సృష్టిస్తూ దేశ ప్రజలను విడగొట్టేందుకు యత్నిస్తోందన్నారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తోందన్నారు. పోరాటాల పురిటి గడ్డ చౌటుప్పల్‌లో డిసెంబరు 15,16,17 తేదీలలో చౌటుప్పల్‌లో నిర్వహిస్తున్న సీపీఎం మహాసభలను విజయవంతం చేసే విధంగా అన్ని వర్గాల ప్రజలు కృషి చేయాలన్నారు. మావేశంలో మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, నాయకులు దయ్యాల నర్సింహ, కొండ అశోక్, కృష్ణ, నాగమణి, మైసయ్య, ఎల్లయ్య, వెంకటేశ్, యాదగిరి, లీల పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలి'

భువనగిరి రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎలిమినేటి కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కనుకుంట్ల రేఖ బాబురావు అన్నారు. శుక్రవారం భువనగిరిలో వారు విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలన్నారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 10నెలల కాలంలోనే రూ.219 కోట్ల నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమ పథకాలను చేపట్టి, ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో పెద్దపీట వేస్తున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా స్థానిక ఎమ్మెల్యే అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పాశం శివానంద్, నాయకులు పక్కీరు కొండల్ రెడ్డి, నానం కృష్ణ, నరాల వెంకటేశ్ యాదవ్, బొల్లేపల్లి అశోక్, మంగ ప్రవీణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

చౌటుప్పల్ టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): శీతాకాలంలో సోకే వ్యాధుల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి కాటం రాజు తెలిపారు. స్థానిక అమ్మానాన్న అనాథాశ్రమంలో శుక్రవారం తంగడపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మానసిక వికలాంగులకు వైద్య పరీక్షలను నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఆశ్రమ నిర్వాహకుడు గట్టు శంకర్, వైద్యాధికారులు శివకుమార్, సౌజన్య, కమలాకర్ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి'

భువనగిరి గంజ్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కాలేజీ గ్రౌండ్‌లో జరగబోయే మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని రాజకీయాలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ పిలుపునిచ్చారు. శుక్రవారం భువనగిరి రహదారి బంగ్లాలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేయాలన్న సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ వెంటనే అమలు చేయాలని, వర్గీకరణకు వ్యతిరేకంగా చేస్తున్న కుట్రలను తిప్పికొట్టడానికి మాదిగలంతా పార్టీలకు అతీతంగా కలసిరావాలని కోరారు. కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బట్టు రాంచంద్రయ్య, నాగారం అంజయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి దేవేందర్‌మాదిగ పాల్గొన్నారు.

రామన్నపేట: మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి మంటి మల్లేశం పిలుపునిచ్చారు.

'సింహ గర్జన సభకు తరలి రావాలి'

సంస్థాన్ నారాయణపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 1న హైదరాబాదులో జరిగే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మునుగోడు నియోజకవర్గ సమన్వయకర్త మహేశ్వరం కృష్ణయ్య కోరారు. సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో శుక్రవారం హలో మాల చలో హైదరాబాద్ సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ డిసెంబర్ 1న హైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే మాలల సింహగర్జనకు మాలలు లక్షలాదిగా తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు బల్లెం రామస్వామి, గుండమల్ల మల్లేష్, మహేశ్వరం స్వామి, కట్ట గాలిబు, గుండమల్ల బాలకృష్ణ, గుండమల్ల రమేష్,మందుగుల శ్రీనివాస్, ఈసం శ్రీనివాస్, కట్ట నర్సింగ్‌రావు, గుండమల్ల బలరాం, నరిపెల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

చంద్రమ్మ ఆశయ సాధనకు పోరాడాలి

బీబీనగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సీనియర్ కమ్యూనిస్టు నాయకురాలు జంగ చంద్రమ్మ ఆశయాల సాధనకు పోరాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు పిలుపునిచ్చారు. బీబీనగర్ మండలం రాఘవాపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన చంద్రమ్మ కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించి నివాళులర్పించారు. ఈసందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ చంద్రమ్మ, ఆమె భర్త ఎల్లయ్య సాయుధ పోరాటంలో చూపిన ధైర్య సాహసాలు స్ఫూర్తిదాయకమన్నారు.

గోదావరి జలాలను అందించేందుకు కృషి

● తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేలు

మోత్కూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మునిసిపాలిటీ ప్రజలకు తాగు నీరుగా గోదావరి జలాలు అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శుక్రవారం మండలంలోని పాటిమట్ల గ్రామంలో ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మోత్కూరు మునిసిపాలిటీకి ఇప్పుడు పానగల్లు ఉదయ సముద్రం రిజర్వాయర్ నుంచి తాగు నీరు అందిస్తున్నప్పటికీ సరిపోవడం లేదని అన్నారు. తక్కువ వ్యవసార్థం ఉన్న పైపులతో పైప లైన్ వేయడం వల్ల మాటీ మాటీకీ పైపులు పగిలి నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని అన్నారు. యాదగిరిగుట్ట నుంచి మోత్కూరుకు గోదావరి జలాలు అందించాలని కలెక్టరు దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. అడ్డగూడూరు మండలంలోని డీ.రేపాక, కొడంపేట గ్రామల మధ్య సుమారు 180ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అందులో పారిశ్రామిక కేంద్రం ఏర్పాటు చేయాడానికి కృషి చేస్తానన్ని అన్నారు. అక్కడ పారిశ్రామిక కేంద్రం ఏర్పాటు చేసినట్లుయితే పలువురు నిరుదోగ్యులకు ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. పాటిమట్ల గ్రామంలో దళిత జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ జానాభా లెక్కల్లో చాలా తక్కువ సంఖ్య నమోదు చేయడంతో తమకు ప్రభుత్వ ప్రయోజనాలు అందడం లేదని పాటిమట్ల గ్రామ దళితులు ఆయనకు వినతి ప్రతం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే కలెక్టరుతో ఫోన్ మాట్లాడాగా ఇప్పుడు జరుగుతున్న కుల గణన సర్వేలో వారి జనాభా ఎంత అన్నది తెలుస్తుందని, తద్వారా వారికి అందవలస్సిన ప్రభుత్వ ప్రయోజనాలు అన్నీ అందుతాయాన్ని కలెక్టర్ చెప్పారన్నారు. కార్యకమంలో సింగిల్ విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టరు గుర్రం లక్ష్మీనరసింహారెడ్డి, నాయకులు పోలేబోయిన లింగయ్య యాదవ్, ఇటీకాల చిరంజీవి, మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లపల్లి వెంకటయ్య, బాలరాజు ఉన్నారు.

యాదగిరిరెడ్డి జీవితం స్ఫూర్తిదాయకం



భువనగిరిలో యాదగిరిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్: వీర తెలంగాణ విప్లవ రైతాంగ సాయుధ పోరాట సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే గుర్రం యాదగిరిరెడ్డి వర్ధంతి వేడుకలు సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. భువనగిరిలోని సీపీఐ కార్యాలయంలో యాదగిరిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సోమన సబిత, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, కార్యవర్గ సభ్యులు ఉడుత రాఘవులు, చొప్పరి సత్తయ్య, విద్యార్థి నాయకులు సుమన్, సిపిఐ నాయకులు యాదగిరి, బాబా, శంకర్, నరసింహ, మంజుల, సాగర్ పాల్గొన్నారు. ఆలేరు నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు చెక్క వెంకటేష్, మాటూరి జానమ్మ, జంగ సరళ, చింతల నీలమ్మ, నాగయ్య, నర్సింహులు, స్వామి, ఉమ పాల్గొన్నారు. గుండాల మండలం సుద్దాల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు హరిశ్చంద్ర, గడ్డమీది పాండరి, అనంతుల రామచంద్రయ్య, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, ఐలయ్య. గోపాల్, స్వామి పాల్గొన్నారు. వలిగొండలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, పోలేపాక యాదయ్య, పట్టణ కార్యదర్శి సుద్దాల సాయికుమార్, సీనియర్ నాయకులు సలిబద్రి రవీందర్, మచ్చ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. రామన్నపేటలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ, పట్టణ కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, కడమంచి జగన్నాథం, ఊట్కూరి భగవంతం, వీరమల్ల ముత్తయ్య, వెంకటయ్య రామ్‌చందర్, పల్లె మల్లేష్, ఏనుతల రమేష్, సిద్దం మల్లేశం పాల్గొన్నారు. రాజాపేటలో నిర్వహించిన కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు కొల్లూరి రాజయ్య పార్టీ మండల కార్యదర్శి చిగుర్ల లింగం, నాయకులు ఒగ్గు కరుణాకర్, రాజనర్సు, రాములు, నర్సింహులు, బిక్షపతి, జంగ అంజయ్య పాల్గొన్నారు.

టీడీపీతోనే బడుగు వర్గాలకు రాజ్యాధికారం



జెండాను ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

సంస్థాన్‌నారాయణపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం లభించిందని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం కమిటీ సభ్యుడు బడుగు లక్ష్మయ్య అన్నారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో శుక్రవారం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కుందారపు యాదయ్య, ఉప్పల కృష్ణ తెలుగు దేశం పార్టీలో చేరారు. పార్టీలు చేరిన వారికి కండువా కప్పి స్వాగతించారు. ఈసందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ అధికారం ఉన్నా లేకపోయినా నిరంతరం ప్రజా సంక్షేమం కోసం టీడీపీ పాటుపడుతోందని ఆయన తెలిపారు. గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రానున్న రోజుల్లో టీడీపీ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అవ్వారి సుబ్బారావు, నాయకులు శ్రీపతి రామ్‌రెడ్డి, కొలను వేణుగోపాల్‌రెడ్డి, దుబ్బాక స్వామి, బడ్డుపల్లి అంజయ్య, డాక్టర్ వెంకటేశం, నేల జంగయ్య, నర్రి నరసింహ, భగవంతు, రాములు, నరసింహ, సత్తయ్య రవీంద్ర పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మునిసిపాలిటీ సమస్యలను పరిష్కరించాలి.. మోత్కూరు: మోత్కూరు మునిసిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం విద్యార్థి రాజకీయ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల నరేష్, జిల్లా అదనపు కలెక్టరు గంగాధర్‌కు వినతిప్రతం అందజేశారు. పాలడుగు సాయి, పందుల వీగ్నేష్, బుర్ర సాయికూమార్ ఆయన వెంట ఉన్నారు.

గొర్రె కాపరుల సంక్షేమానికి తోడ్పాటునందించాలి.. భువనగిరి రూరల్: గొర్రెల కాపరుల సంక్షేమానికి ప్రభుత్వం తోడ్పాటునందించాలని ఆ సంఘం అధ్యక్షుడు దయ్యాల మహేశ్ అన్నారు. శుక్రవారం భువనగిరి మండలం వీరవెల్లి బీరప్ప గొర్ల పెంపకం దారుల సహకార సంఘం ఎన్నికలు ఏక గ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా దయ్యాల మహేశ్‌ను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా రేగు మహేశ్, కార్యదర్శిగా తోటకూరి అశోక్, డైరెక్టర్లుగా మోటే ఉప్పలయ్య, రేగు అండాలు, రేగు సుగుణమ్మ, జెట్ట శ్రీనివాసులు ఎన్నికయ్యారు.

పేదల పక్షాన ఎర్ర జెండా పోరాటం.. ఆలేరు: పేదప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైనా ఆ సమస్య పరిష్కారం కోసం వారికి అండగా నిలిచి పోరాడేది ఎర్రజెండా ఒక్కటేనని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎంఏ.ఇక్బాల్ అన్నారు. శుక్రవారం జరిగిన పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబరు 15 నుండి చౌటుప్పల్‌లో జరిగే మహాసభలకు పార్టీ ప్రజాసంగాలు నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు మల్లేశం, వడ్డెమాని బాలరాజ్, శాంత, బొప్పిడి యాదగిరి, భువనగిరి గణేష్, చెన్న రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ.. మోత్కూరు : మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌లో జిల్లా ఏరువాక కేంద్రం భువనగిరి శాస్త్రవేత డాక్టర్ మమత శుక్రవారం రైతులకు 30కిలోల శనగ విత్తనాల సంచులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శనగ విత్తనాలను ఆదిలాబాదు వ్యవసాయ పరిశోధన కేంద్రం నిర్ధారించిందన్నారు. ఏవో వి. కీర్తి, ఏఈవోల పి. గోపానాథ్, రైతులు కల్పన, సోమ్మయ్య, భీంరెడి పాల్గొన్నారు.

వర్గీకరణ అమలులో నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం.. ఆలేరు : ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించి ఎస్సీ ఉపకులాలకు రిజర్వేషన్లు అమలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ అమలు విషయంలో నిర్లక్ష్య ధోరణిగా అవలబిస్తోందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధన కార్యదర్శి కందుల శంకర్ విమర్శించారు. శుక్రవారం ఆలేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సర్పంచ్ వక్క రామ్‌ప్రసాద్, మోత్కురి అయిలయ్య ఎమ్మార్పీఎస్ జిల్లా మండల నాయకులు సంగి స్వామి, భైరపాక నాగరాజు, గ్యార ఎల్లయ్య పాల్గొన్నారు.

చదువులకు అందిస్తున్న సేవలు అభినందనీయం.. చౌటుప్పల్ టౌన్ : పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అందిస్తున్న సేవలు అభినందనీయమని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. మునిసిపాలిటీలోని లక్కారం చెందిన పేద విద్యార్థిని ఏనుగు నేహ రెడ్డి ఉన్నత చదువుల నిమిత్తం తల్లిదండ్రులు ఏనుగు అనిత- మల్లారెడ్డిలకు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తరుఫున రూ.50 వేలను శుక్రవారం చైర్మన్ రాజు అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్ లు కాసర్ల మంజుల , కొయ్యడ సైదులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలిస్తున్న సాయిశోభ

మోటకొండూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నేషనల్ వెక్టర్ బాండ్ డీసీజ్ కంట్రోలింగ్ అధికారిని సాయిశోభ శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు, సూపర్‌వైజర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నేషనల్ వెక్టర్ బాండ్ డీసీజ్ కంట్రోలింగ్ ప్రోగ్రాం, క్షయ, లెప్రసీ, హెచ్ఐవి, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సేవల గురించి వివరించారు. డిసెంబర్ మొదటి వారంలో చేపట్టవలసిన లెప్రసీ కేసుల నిర్ధారణ ఇంటింటి సర్వేపై అవగమన కల్పించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి విజయ్, ఎంఎల్‌హెచ్‌పీలు శివాని, హారిక, పార్వతమ్మ, హెచ్ఈఓ నర్సింహ, సుగుణ, సుభాషిని, విజయరాణి, అరుణ, సైదులు, అంజయ్య పాల్గొన్నారు.

దివీస్ ఆధ్వర్యంలో హెల్త్ కిట్ల పంపిణీ

చౌటుప్పల్ రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మండలం ఎస్ లింగోటం ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం దివీస్ ల్యాబోరేటరిస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో హెల్త్ కిట్లు పంపిణీ చేశారు. వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జయంత్, ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి, ఉమా, దివీస్ ప్రతినిధులు సాయికృష్ణ, వంశీ కృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి



సంతకాలను సేకరిస్తున్న బీఆర్ఎస్ఎస్ నాయకులు

మోత్కూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మోత్కూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆర్టీసీ బస్సు డిపో ఏర్పాటు చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితీ ఆధ్వర్యంలో శుక్రవారం సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితీ రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్, నాయకులు కళిమెల్ల నర్సయ్య, ఆర్థ ప్రతాప్ రెడ్డి, దామారోజు సత్యనారాయణ చారి, మహేందర్, మధు పాల్గొన్నారు.